సాక్షి
వికారాబాద్
సోమవారం । 25 । మార్చి । 2024



నియంత్రణకు పాట్లు

ప్లాస్టిక్ నిషేధించేందుకు ప్రభుత్వం ఎన్ని నిబంధనలు తీసుకువచ్చిన ఫలితం లేకుండా పోయింది. 8లో▸



నిలువెల్లా నిర్లక్ష్యం

పదేళ్లుగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు చదువుకోవడానికి కనీస వసతులు కరువయ్యాయి. 9లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సాయంత్రం 6:34

సహర్ : మంగళవారం ఉదయం 4:54

న్యూస్‌రీల్

హోలీ ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఒక్కరు హోలీ పండుగ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహిపాల్



మహిపాల్‌కు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

మోమిన్‌పేట: బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహిపాల్ నియమితులయ్యారని జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశామన్నారు. అనంతరం ఉపాధ్యక్షుడు మహిపాల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు.

నేడు చంద్రగ్రహణం లేదు

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్



మాట్లాడుతున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: భారతదేశంలో సోమవారం హోలీ పండుగ రోజు చంద్రగ్రహణం కనిపించదని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ స్పష్టం చేశారు. బాలాజీ దేవాలయం వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా, ఆఫ్రికా దేశాల్లో చంద్రగ్రహణం కనిపిస్తుందని.. ఆ సమయం ప్రకారం చూస్తే ఉదయం 9 గంటల సమయంలో గ్రహణం పడుతుందన్నారు. మనకు ఉదయం చంద్రుడు కనిపించడు కాబట్టి మన దగ్గర చంద్రగ్రహణం ఉండదని చెప్పారు. చాలామంది భక్తులు హోలీ రోజు గ్రహణం ఉంటుందా.. ఆలయం మూసివేస్తారా అనే ప్రశ్నలు అడుగుతున్నారని.. భక్తులకు ఇలాంటి సందేహాలు అవసరం లేదని.. చంద్రగ్రహణం మన దేశంలో ఉండదని స్పష్టం చేశారు. ప్రజలంతా ఆనందంగా హోలీ పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు.

చేవెళ్ల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తా

సివిల్ ఇంజనీర్ సూర్యప్రకాశ్ రెడ్డి

చేవెళ్ల: ప్రజలకు సత్వర న్యాయం, అవినీతి రహిత పాలన అందించాలనే ఆలోచనతో ఎంపీ ఎన్నికల్లో పోటీచేసేందుకు నిర్ణయించుకున్నట్లు సివిల్ ఇంజనీర్ సూర్యప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు చేవెళ్లలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్ల లోక్‌సభ బరి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోతున్నట్లు తెలిపారు. సరూర్‌నగర్‌కు చెందిన తాను ఇంజనీరింగ్ చదివి దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టుల్లో పనిచేసినట్లు తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో తిరిగిన సమయంలో ప్రజలకు సేవచేయాలనే ఆలోచన కలిగి పోటీకి నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రైతు బిడ్డగా రైతులతోపాటు సామాన్య ప్రజల సమస్యలు తెలుసన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఆలోచనతో 14 అంశాలతో కూడిన మేనిఫెస్టోను రూపొందించినట్టు పేర్కొన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే అవినీతి రహిత పాలనతోపాటు రాజకీయ, సామాజిక, విద్య, వ్యవసాయ ఆరోగ్య సంస్కరణలు అవసరమన్నారు. ప్రజలు ఎన్నికల్లో తన ను ఆదరిస్తే వారికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

బడి బాధలు

ప్రభుత్వ పాఠశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామంటూ ప్రభుత్వాలు హామీలు కురిపిస్తున్నా అవి ఆచరణకు నోచుకోవడం లేదు.

సరిహద్దు పాఠశాలలను పట్టించుకోని పాలకులు

- డజనుకు పైగా స్కూళ్లలో ఐదు తరగతులకు ఒకటే గది
- పదేళ్లుగా ఏకోపాధ్యాయులే..
- సర్కారు బడుల్లో సమస్యల తిష్ట
- విద్యకు దూరమవుతున్న విద్యార్థులు



దుగ్గాపూర్ పాఠశాలలో ఒకే గదిలో ఐదు తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

పెద్దేముల్: సరిహద్దు పాఠశాలల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. తరగతి గదులున్న చోట ఉపాధ్యాయులుండరు... ఉపాధ్యాయులు ఉంటే సరిపడగా తరగతిగదులుండవు.. రెండూ ఉంటే వసతులు ఉండని దుస్థితి. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు విన్నవించినా లాభం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్కారు బడుల్లో వంట గదులు, మరుగు దొడ్లు, ప్రహరీలు, పూర్తి స్థాయిల్లో కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. కానీ మండలంలో ఈ లక్ష్యం నీరుగారుతోంది. మన ఊరు మన బడి జాడ లేదు. పదేళ్లుగా రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవు పెడితే మరొకరిని ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు. విద్యాశాఖ అధికారులు సైతం సీఆర్‌పీలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

పోస్టులు ఖాళీ

మండల పరిధిలోని 37 గ్రామ పంచాయతీల్లో 61 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ప్రైమరీ పాఠశాలల్లో 1850 మంది, యూపీఎస్ పాఠశాలల్లో 496 మంది, ఉన్నత పాఠశాలల్లో 2,046 మంది, కేజీబీవీలో 232, మోడల్ స్కూల్‌లో 380 మంది విద్యార్థులున్నారు. కానీ ఏ ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయి వసతులు లేవు. ప్రధానంగా కర్ణాటక రాష్ట్రం సరిహద్దు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులు ఉన్న పాఠశాలకు కేవలం ఒకటే గది, ఒకరే ఉపాధ్యాయులున్నారు. మరి కొన్ని పాఠశాలలో సరిపడగా తరగతి గదులు లేక ఆరుబయటే బోధిస్తున్నారు. గతంలో నిర్మించిన టాయిలెట్స్ శిథిలావస్థకు చేరి విష పురుగులు తిరగటంతో విద్యార్థులు భయందోళనకు గురవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బుద్దారం ప్రాథమిక పాఠశాలల్లో మూడేళ్ల క్రితం ప్రారంభించిన వంట గది నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఇదే విషయం మాజీ సర్పంచ్ లక్ష్మి మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేసినా ఏ అధికారి పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పెద్దేముల్ జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో 400 మంది విద్యార్థులున్నా వసతులు కరువయ్యాయి. మండల పరిధిలో 263 మంది ఉపాధ్యాయులకుగాను 231మంది ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన 31 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

ఉపాధ్యాయ ఖాళీల వివరాలు

ప్రైమరీ ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు	05
ఎస్జీటీలు	15
గెజిటెడ్ జీహెచ్‌ఎం	02
సోషల్ స్టడీస్	03
ఇంగ్లిష్	04
డ్రాయింగ్	01
క్రాఫ్ట్	01

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంట గదులతోపాటుగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పదేళ్లుగా ఇన్‌చార్జి పాలనే

పదేళ్లుగా మండలానికి పూర్తి స్థాయి ఎంఈఓను నియమించలేదు. ఇన్‌చార్జి ఎంఈఓతోనే కొనసాగిస్తున్నారు. సుమారు మూడు మండలాలకు ఒక్క ఎంఈఓ పాలనలోనే సాగిస్తున్నట్లు సమాచారం.

ఒకటే తరగతిగది ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలలు

పాఠశాల పేరు	విద్యార్థుల సంఖ్య
దుగ్గాపూర్	24
సిద్దన్న మడుగుతండా	27
ఆత్కూర్‌తండా	25
టీసీ కోట్ల పెద్దేముల్	22
దారుణివాగుతండా	12
నర్సపూర్	21
ఓంటి మామిడి తండా	10
రచ్చకట్టతండా	29
రాంసింగ్‌తండా	09
తింసాన్‌పల్లి	19
ఓంలానాయక్‌తండా	37

వసతులు కల్పించాలి



సర్కార్ పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తారు. కొన్ని పాఠశాలలో నీరున్నా మరుగుదొడ్లు లేవు. అన్ని సౌకర్యాలుంటేనే పాఠశాల విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుంది.

– శ్రీనివాస్ మాజీ ఉప సర్పంచ్, దుగ్గాపూర్

మూడేళ్లుగా జాప్యం



బుద్దారం పాఠశాలలో మూడేళ్లుగా వంటగది నిర్మించలేదు. సంబంధిత అధికారులకు విషయం చెప్పినా పట్టించుకోవడం లేదు. కొద్దిపాటి వర్షం కురిసినా వంటకు ఆటంకం ఏర్పడుతుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– లక్ష్మి, మాజీ సర్పంచ్, బుద్దారం

నివేదిక అందజేశాం



మరుగుదొడ్లు, వంట గదులు, ప్రహరీలు, తాగు నీరు తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులకు నివేదిక సైతం అందజేశాం. ఆయా గ్రామాల సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు తమకు వివరించారు.

– వెంకటయ్య, ఇన్‌చార్జి ఎంఈఓ, పెద్దేముల్





పట్నం సునీతారెడ్డి దంపతులు

'పట్నం' బాటపట్టిన కేడర్!

- సునీతారెడ్డి గెలుపుకోసం మల్కాజ్‌గిరికి అనుచరుల పయనం
- లోక్‌సభ సెగ్మెంట్‌లో దంపతుల విస్తృత పర్యటన

తాండూరు: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థులు తమ అనుచర గణంతో పార్లమెంట్ నియోజకవర్గాన్ని చుట్టుముట్టేస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తారనుకున్న సునీతారెడ్డికి అధిష్టానం మల్కాజ్‌గిరి నుంచి అవకాశం ఇవ్వడంతో పట్నం వర్గీయులు ప్రచారానికి సన్నద్ధమవుతున్నారన్నారు. రెండు నెలల పాటు పార్లమెంట్ సెగ్మెంట్‌లో ప్రచారానికి వ్యూహ రచన చేస్తున్నారు. ఇందుకు జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మాజీ ప్రజా ప్రతినిధులు సిద్ధమవుతున్నారు.

ఓటర్లు ఎక్కువ.. సమయం తక్కువ

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూడు దశాబ్దాల పాటు రాజకీయాల్లో చక్రం తిప్పిన పట్నం మహేందర్‌రెడ్డికి విషమ పరీక్ష ఎదురైంది. రెండు నెలల క్రితం వరకు మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. ఐదేళ్లుగా ఆ పార్టీ పెద్దలు పట్నం దంపతులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో అసెంబ్లీ ఎన్నికల అనంతరం పట్నం దంపతులు కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ముందు నుంచి వారు చేవెళ్ల పార్లమెంట్ టికెట్ పట్నం సునీతారెడ్డికే వస్తుందనే నమ్మకంతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని కాంగ్రెస్ నేతలు ఆమెతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పార్లమెంట పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఇతర పార్టీలలోని నాయకులను, ప్రజా ప్రతినిధులను హస్తం గూటికి తీసుకురావడంలో సక్సెస్ అయ్యారు. సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సైతం కారు స్టీరింగ్ వదిలేసి కాంగ్రెస్‌లో చేరారు. అధిష్టానం సైతం సిట్టింగ్ ఎంపీకే టికెట్ కేటాయించింది. దీంతో చేవెళ్ల రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి. దీంతో ఒక్కసారిగా పట్నం దంపతులతో పాటు కేడర్ ఒకింత డిప్రెషన్‌లోకి వెళ్లారు. నాలుగు రోజుల క్రితం విడుదల చేసిన లిస్టులో గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా గెలిచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానాన్ని సునీతారెడ్డికి కేటాయించారు. సెటిలర్లు అధికంగా ఉన్న పార్లమెంట్ నియోజవర్గం కావడంతో పాటు ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఎన్నికలకు సమయం తక్కువ ఉంది. ఇక్కడి కాంగ్రెస్ నాయకుల మద్దతు కూడగట్టుకొనేందుకు పట్నం వర్గీయులంతా వెంటనే ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లలో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

గెలుపే లక్ష్యం

తాండూరు నియోజకవర్గంలో పట్నం కుటుంబానికి బలమైన కేడర్ ఉంది. 30 ఏళ్లుగా తాండూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తూ వచ్చిన పట్నం మహేందర్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో పోటీకి దూరమయ్యారు. పట్నం సునీతారెడ్డికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ టికెట్ ప్రకటించడంతో తాండూరు నియోజకవర్గంలోని పట్నం వర్గీయులంతా మల్కాజ్‌గిరిలో ఎన్నికల ప్రచారం చేసేందుకు పయణమవుతున్నారు. ఇప్పటికే కొందరు మల్కాజ్‌గిరికి చేరుకోగా మరో రెండు రోజుల్లో మిగిలిన వారంతా ప్రచారానికి వెళ్లనున్నట్లు సమాచారం. మల్కాజ్‌గిరిలో బీసీ, మైనార్టీ, బ్రాహ్మణ ఓటర్లు అధికంగా ఉన్నాయి. దీంతో జిల్లాలోని బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, మైనార్టీ నాయకులు, బీసీ నాయకులు సునీతమ్మ గెలుపుకోసం పట్నం బాటపడుతున్నారు.



మాట్లాడుతున్న సబితారెడ్డి, చిత్రంలో కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కాసానిని గెలిపించుకుందాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా రెడ్డి

మీర్‌పేట: బడుగు, బలహీన వర్గాల గొంతుక అయిన ఈ ప్రాంతానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ వాణి, బాణి లోక్‌సభలో వినిపించాలంటే ప్రజలంతా ఓటు వేసి గెలిపించుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేటలోని ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంటరీ సన్నాహక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నిషానా లేకుండా చేస్తానని ముఖ్యమంత్రి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని, కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చిన నాయకుడిపై చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. వంద రోజుల్లో మార్పు తెస్తామన్నవారు రాష్ట్రంలో కరెంటు కోతల్లో మార్పు తెచ్చారని, పంటలను ఎండబెడుతున్నారని, రైతులకు ఇస్తానన్న రుణమాఫీ ఇవ్వలేదని, ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ముక్కుముఖం తెలియని రంజిత్ రెడ్డిని గతంలో కేసీఆర్ ఆశీర్వదంతో గెలిపించుకుంటే నేడు మోసపూరితంగా పార్టీ మారారని విమర్శించారు. మన శక్తి సామర్థ్యాలు చూపించాల్సిన సమయం ఆసన్నమైందని, 96 కులాలను ఏకం చేసి వారికి గుర్తింపు తెచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌కు మహేశ్వరం నుంచి 60 వేల మెజారిటీ ఇచ్చి చేవెళ్లలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కార్యకర్తల శ్రమ లేకుండా ఏ నాయకుడూ ఎదగలేరని, అందరూ సమష్టిగా పనిచేసి తన గెలుపునకు సహకరించాలని కోరారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని అన్నారు. ఈ ప్రాంతం నుంచి గతంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పనితనం ఏమిటో చూశారని, ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గె మల్లేశం, దయానంద్ గుప్తా, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

భువనగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం: గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషిచేయాలని భువనగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ కోరారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థిగా మల్లేశ్‌ను ప్రకటించడంతో ఆదివారం పెద్దసంఖ్యలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. భువనగిరి ఖిల్లాపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసేందుకు బూత్ స్థాయి నుంచి బీఆర్‌ఎస్ విభాగానికి చెందిన విద్యార్థి, యువత, కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించి, అండగా ఉంటానన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మల్లేశ్‌ను కలిసి అభినందనలు తెలిపినవారిలో బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్, రైతు సమతి నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, మొద్దు అంజిరెడ్డి, పార్టీ నాయకులు అల్వాల్ వెంకట్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, అచ్చన శ్రీకాంత్, కాలె రమేష్ తదితరులు ఉన్నారు.



క్యామను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- పట్టణాల్లో ఎక్కడ బడితే అక్కడ చెత్త పారబోత
- అన్ని మున్సిపాలిటీల్లో అదే పరిస్థితి
- రోడ్లపైనే పారుతున్న మురుగు
- కోట్లు ఖర్చు చేస్తున్నా తీరని సమస్య
- పట్టించుకోని మున్సిపల్ పాలకవర్గం



పరిగి పట్టణంలోని మైత్రి కాలనీకి వెళ్లే దారిలో రోడ్డుపై పారుతున్న మురుగు

వికారాబాద్: పట్టణాల్లో పాలన పడకేసింది. కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు ఒకరితో ఒకరు పంచాయితీ పెట్టుకోవడం తప్ప పాలనపై దృష్టి సారించడం లేదు. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారయ్యింది. కాలనీల్లో ఇళ్ల మధ్య, రోడ్లపైన మురుగు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథులు లేకుండా పోయారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కిందిస్థాయి సిబ్బంది ఆడింది ఆట.. పాడిందే పాట అన్నట్లు తయారైంది. నివాసాల మధ్య మురుగు నిల్వ ఉండటమే కాకుండా రోడ్లపైన పారుతోంది.

తీవ్రమవుతున్న పారిశుద్ధ్య సమస్య

పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్యలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. వేసవిలో ఈ సమస్య తగ్గాల్సి ఉండగా మరింత ఎక్కువ అవుతోంది. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొంత మెరుగు పడినా పట్టణాల్లో మాత్రం అధ్వానంగానే కనిపిస్తోంది. చాలా ప్రాంతాల్లో చెత్త సేకరించడం లేదు. ఎక్కడికక్కడ వదిలేస్తుండటంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.దుర్వాసన రావడంతోపాటు దోమలు, ఈగలు వృద్ధి చెంది నిద్ర లేకుండా చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని అధికారులు సూచిస్తున్నా ఆ దిశగా చర్యలు కనిపించడంలేదు. తడిపొడి చెత్తను కలిపి సేకరించి శివారు ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. పట్టణ ప్రగతి పేరుతో అప్పుడప్పుడు హడావుడి చేస్తున్న అధికారులు కార్యక్రమం ముగిసిన వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలను గాలికొదిలేస్తున్నారు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారవుతోంది.

ఇళ్ల మధ్యే మురుగు

పురపాలక సంఘాల పరిధిలోని చాలా కాలనీలు దుర్గంధంతో నిండిపోయాయి. నివాసాల మధ్య మురుగు పేరుకుపోయి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పరిస్థితి దారుణంగా ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికరులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్కో మున్సిపాలిటీలో రూ.కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నా.. సమస్యలు మాత్రం అలాగే దర్శనమిస్తున్నాయి. అధికారులు, కౌన్సిలర్లు అని తేడా లేకుండా ఒకరిపై ఒకరు గొడవలకు దిగటం.. అందినకాడికి దండుకోవడం తప్ప ఎక్కడ కూడా సమస్యలపై దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఉండగా చెత్త సేకరణలో మాత్రం అన్నిటి పరిస్థితి ఒకేలా ఉందనేది బహిరంగ రహస్యం. అయితే పారిశుద్ధ్యంపై అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితులకు ఎలాంటి పొంతన కనిపించడం లేదు. తడిపొడి చెత్త వేరు చేయటం కోసం మున్సిపాలిటీల్లో చెత్త బుట్టలు అందజేస్తున్నప్పటికీ తడిపొడి చెత్తను వేరు చేసే విషయంలో అవగాహన కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారు. గతంలో తాండూరు, పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీల్లో కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్లు ఉండేవి. ఈ ప్రాంతాల్లో తయారు చేసిన ఎరువులను పట్టణ ప్రకృతి వనాల్లో, నర్సరీల్లో వాడేవారు. ప్రస్తుతం యూనిట్లను మూలకు పడేశారు. దీంతో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గం చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ

మర్పల్లి: మండల కేంద్రంలోని సెంట్రల్ మెథడిస్టు చర్చిలో ఆదివారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ వేడుకలకు వారం రోజులు ముందుగా మట్టల ఆదివారం ఉత్సవం నిర్వహిస్తున్నారు. బైబిల్ ప్రకారం యూదుల సంప్రదాయం ప్రకారం ఏసు ప్రభు పట్టాభిషేకం సమయంలో ఆయన్ను గాడిదపై కూర్చోపెట్టి ఆటపాటల నడుమ ఊరేగింపు నిర్వహించారన్నారని.. అదే ఆనవాయతీ ప్రకారం ఈత మట్టల పండుగ నిర్వహిస్తున్నామని పాస్టర్ కావలి ప్రణీత్ తెలిపారు.



మర్పల్లిలో మట్టల పండుగ సందర్భంగా ఊరేగింపు

క్లుప్తంగా

క్రీడలతో మానసిక ప్రశాంతత

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్‌



టాస్‌ వేసి క్రికెట్‌ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

పూడూరు: క్రీడలు మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దారుఢ్యానికి తోడ్పడుతాయని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్‌ బూనేటి అన్నారు. ఆదివారం మండలంలోని దేవనోనిగూడ గ్రామంలో క్రికెట్‌ టోర్నమెంట్‌ను చన్గోముల్‌ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి పోటీతత్వాన్ని అలవర్చుకున్నప్పుడే అన్ని రంగాల్లో రాణించవచ్చని అన్నారు. క్రీడాపోటీలు స్నేహభావంతో ఉండాలని గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు హరికృష్ణ, బీజేపీ నాయకులు అనిల్‌కుమార్‌, అశోక్‌, భాస్కర్‌, ప్రకాశ్‌, రమేశ్‌, పాండు, శ్రీనివాస్‌, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ఉజ్వల భవిష్యత్‌



మాట్లాడుతున్న మల్లేశ్‌పటేల్‌

పూడూరు: నరేంద్రమోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని సినిమా సెన్సార్‌ బోర్డు సభ్యుడు మల్లేశ్‌పటేల్‌ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మన్నేగూడలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. ఆడబిడ్డలకు ఉజ్వల గ్యాస్‌, రైతులకు పెట్టుబడి కింద ఏడాదికి ఆరు వేల నగదును ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాముయాదవ్‌, నాయకులు రాఘవేందర్‌, రవీందర్‌, శ్రీశైలం, రాజేశ్‌గౌడ్‌, రాఘవేందర్‌రెడ్డి, పాండు, రవికుమార్‌, కృష్ణాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడిని చూసేందుకు వెళ్తూ..

తండ్రి దుర్మరణం

కొందుర్గు: అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కుమారుడిని చూసేందుకు వెళ్తూ ఓ తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన కొందుర్గు మండలం చెక్కలోనిగూడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొప్పల లక్ష్మమ్మ, రామచంద్రయ్య దంపతుల కుమారుడు మహేష్‌ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. లక్ష్మమ్మ చికిత్స పొందుతున్న కుమారుడి వద్దనే ఉంది. కాగా, తండ్రి రామచంద్రయ్య(54) తన కుమారుడిని చూసివద్దామని ఆదివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. చెక్కలోనిగూడ నుంచి కొందుర్గు వైపు వెళ్తుండగా లారీ డ్రైవర్‌ సడన్‌ బ్రేక్‌ వేయడంతో రామచంద్రయ్య ద్విచక్ర వాహనం వెనుక వైపు నుంచి లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

ఇష్టానుసారంగా నిర్మాణాలు ..!

అత్తాపూర్‌: అత్తాపూర్‌ ఓల్డ్‌ విలేజ్‌ తదితర ప్రాంతాల్లోని ఇరుకైన రోడ్డు మార్గాల్లో కొందరు బహుళ అంతస్తులు నిర్మిస్తూ పరిసరాలను ఆక్రమిస్తున్నారు. దీంతో గ్రామస్తులు జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతిపత్రాలు అందజేయడంతో పనులు ఆపివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

నిబంధనలకు తూట్లు.. నియంత్రణకు పాట్లు

పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్‌ రక్కసిపై నిషేధం తూతూమంత్రంగా సాగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి యథేచ్ఛగా ప్లాస్టిక్‌ కవర్లు, వస్తువులు వినియోగిస్తున్నారు. దీంతో మానవాళికి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది.

- ఇష్టానుసారంగా ప్లాస్టిక్‌ వినియోగం
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు



పరిగిలో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ వ్యర్థాలు

పరిగి: ప్లాస్టిక్‌ నిషేధించేందుకు ప్రభుత్వం ఎన్ని నిబంధనలు తీసుకువచ్చిన ఫలితం లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో దాని వినియోగం రోజు రోజుకు పెరిగిపోతోంది. దీంతో మానవాళికి ముప్పు తప్పదనే హెచ్చరికలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ ప్రమాణాలకు లోబడి తయారు చేసిన ప్లాస్టిక్‌ను మాత్రమే వినియోగించాలన్న సూచన ఎక్కడా అమలు కావడం లేదు. ప్లాస్టిక్‌ను శాశ్వతంగా నిషేధించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార సంస్థలు, గృహాల నుంచి రోజుకు 11 మెట్రిక్‌ టన్నుల వరకు చెత్తను సేకరిస్తారు. అందులో అధికభాగం ప్లాస్టిక్‌ సంబంధించిన వ్యర్థాలే ఉంటాయి. మున్సిపల్‌ అధికారులు ప్లాస్టిక్‌ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నాయకులు ఒత్తిళ్లకు..

ప్లాస్టిక్‌ కవర్లు, వస్తువుల నిషేధంపై ఉమ్మడి రాష్ట్రంలోనే జీఓ తీసుకువచ్చారు. దీంతో మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మున్సిపాలిటీల్లోని పారిశుద్ధ్య విభాగం అధికారుల బృందాలు ఆకస్మిక దాడులు చేసి వ్యాపారులకు జరిమానాలు విధించింది. కొద్ది రోజులకే ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్‌ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్టు జీఓ వచ్చింది. అధికారులు మున్సిపాలిటీలో ఎక్కడ ప్లాస్టిక్‌ను వినియోగించిన, అమ్మిన జరిమానాలు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మున్సిపాలిటీల్లోని ప్లాస్టిక్‌ దుకాణాలపై దాడులు నిర్వహించారు. నిత్యం ప్లాస్టిక్‌ అమ్ముతున్న వారికి జరిమానాలు విధించారు. కానీ రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు అరకొర దాడులతో మమ అనిపిస్తున్నారు.

వాస్తవ పరిస్థితులు భిన్నం

ప్లాస్టిక్‌ వినియోగానికి చెక్‌ పెట్టేందుకు ప్రభుత్వం దశల వారీగా నిషేధానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పట్టణాలు, గ్రామాల్లో 50 మైక్రాన్‌ల కన్న తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్‌ను అమ్మరాదని మొదట సూచించింది. తరువాత 75 మైక్రాన్‌ల కన్న తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను అమ్మడం, వినియోగించడం చేయరాదని పేర్కొంది. దీంతో గతేడాది 75 నుంచి 125 మైక్రాన్‌ల కన్న తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించరాదని ప్రభుత్వం నిబంధనలు తీసుకువచ్చింది. ఇలా దశల వారీగా ప్లాస్టిక్‌ను నిషేధించాలని నిత్యం మైక్రాన్ల సైజ్‌ను పెంచుతూ పోతుందని అధికారులు సూచిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం యథావిధిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారని పర్యావరణ వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్కువ మైక్రాన్‌లు ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పట్టణంలో నిత్యం వ్యాపార సముదాయాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, హెచ్చరికలు జారీ చేస్తున్నాం. నిబంధనాలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తాం.

– వెంకటయ్య, మున్సిపల్‌ కమిషనర్‌, పరిగి

తనిఖీల్లో రూ.2.93 లక్షలు పట్టివేత

గౌతపూర్‌ వద్ద సీజ్‌ చేసిన పోలీసులు



సీజ్‌ చేసిన నగదును చూయిస్తున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్‌: ఎలాంటి పత్రాలు లేకుండా స్కూటీలో తరలిస్తున్న నగదును మండలంలో కరన్‌కోట్‌ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు పట్టణంలోని సీసీఐ కాలనీకి చెందిన మహ్మద్‌ అనాజ్‌ తన స్కూటీపై తాండూరు నుంచి గౌతపూర్‌ వెళ్తున్నారు. పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఆయన స్కూటీలో రూ.2.93 లక్షలు గుర్తించారు. వీటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్‌ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొమ్మును కలెక్టర్‌ ట్రెజరీకి తరలించామన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్‌ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే సీజ్‌ చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

కాండం తొలిచి.. నష్టం మిగిల్చి



గట్టెపల్లి గ్రామంలో సాగుచేసిన వరి పంట

- వరిలో కాండం తొలుచు పురుగు
- ఆందోళన చెందుతున్న రైతులు

ధారూరు: ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటకు చీడపీడలు ఆశించి నష్టం కలుగజేస్తే ఆ రైతన్న వ్యథ వర్ణనాతీతం. ప్రస్తుతం యాసంగిలో సాగు చేసిన వరి పంటకి కాండం తొలుచు పురుగు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. ధారూరు మండలంలో 4,980 ఎకరాల్లో వరిని సాగుచేశారు. గత కొన్ని రోజుల నుంచి కాండం తొలుచు పురుగు ఆశించి పంటకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని అన్నదాతలు విచారం వ్యక్తం చేశారు. వానాకాలం ఈ బెడద లేదని, యాసంగి పంటకే ఎందుకు వ్యాపిస్తుందో అర్థం కావడం లేదని విలపించారు. నారుమడి దశలోనే ఆకు కింది భాగంలో గుడ్లు పెడుతుందని, మొదట్లో తెలియక నివారణ చర్యలు తీసుకోలేదని వాపోయారు. ప్రస్తుతం ఈనిన దశలో ఉన్న వరిలో తెల్ల కంకులు కనబడుతున్నాయని, మొక్కను పట్టుకుని పీకేస్తే సులభంగా చేతికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పురుగు వేరు వ్యవస్థను తినేస్తుందని, మొక్క పీకగానే ఊడి వస్తుందని తెలిపారు. దీంతో దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

నివారణ చర్యలు

కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరోఫైరీపాస్‌ 2.5 మిల్లీ లీటర్ల మందు లేదా ఓఆర్‌ కార్టప్‌ హైడ్రోక్లోరైడ్‌ 2.2 గ్రాములు ఒక లీటర్‌ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్బోఫురాన్‌ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున చల్లుకోవాలి. దీంతో పురుగు ఉధృతి తగ్గి పంట నిలబడుతుంది.

– వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్‌

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.30 వేల నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



బీరువాలో చిందరవందరగా పడి ఉన్న సామగ్రి

యాలాల: తాళం వేసిన ఇంటికి కన్నం వేశాడో దుండగుడు. నగదుతో పాటు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. ఈ సంఘటన మండలంలోని మిత్రానగర్‌లో చోటు చేసుకుంది. బాధితురాలు, స్థానికుల వివరాల మేరకు.. మిత్రానగర్‌లో ఉండే కాశమ్మ ఆర్టీసీ ఉద్యోగి. ఎప్పటిలాగే శనివారం ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దుండగుడు ఇంటి తాళం విరగ్గొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు. బీరువాలో ఉన్న సుమారు రూ.30వేలతో పాటు 3 తులాల బంగారు ఆభరణాలను లూటీ చేశాడు. విధులు ముగించుకొని ఇంటికొచ్చిన కాశమ్మకు వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో నగదుతో పాటు బంగారం కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని గుర్తించింది. ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడటాన్ని గమనించింది. సదరు వ్యక్తి చోరీకి పాల్పడి ఉంటాడని బాధితురాలు అనుమానం వ్యక్తం చేసింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కేసు నమోదుకు తిప్పలు

చోరీ జరిగిన ప్రాంతం మా పరిధిలోకి రాదని యాలాల పోలీసులు, కాదు మీ పరిధిలోకే వస్తుందని పట్టణ పోలీసుల మధ్య వాదనలు జరిగినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని యాలాల పరిధిలోకి వచ్చే మిత్రానగర్‌ చోరీ కేసు నమోదు చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయమై యాలాల ఎస్‌ఐ శంకర్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో యత్నించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదు.

హోలీ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్‌



అనంతగిరి: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్‌ నారాయణరెడ్డి జిల్లా ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. రాగద్వేషాలకు అతీతంగా అందరిని ఒకచోట చేర్చే హోలీ ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. మనసంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా జిల్లా ప్రజలు ఆనందోత్సాహలతో హోలీ జరుపుకోవాలని కలెక్టర్‌ సూచించారు.

లైసెన్స్‌ లేని ఫైనాన్స్‌ సంస్థలపై చర్యలకు డిమాండ్‌

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా లైసెన్స్‌ లేకుండా ఫైనాన్స్‌ వడ్డీ వ్యాపారంతో పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్‌ ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అధిక వడ్డీలతో పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

వేడినూనె పడి తీవ్ర గాయాలు

ఆమనగల్లు: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో తినుబండారాల దుకాణం పెట్టుకున్న వెల్దండ మండలం బండోనిపల్లికి చెందిన అర్జున్‌ కుమారుడు జయదేవ్‌(3)పై వేడినూనె పడటంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బండోనిపల్లికి చెందిన అర్జున్‌, అతని కుటుంబ సభ్యులు ఆమనగల్లు లోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తినుబండారాల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. శనివారం రాత్రి ప్రమాదవశాత్తు జయదేవ్‌పై వేడినూనె పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపారు. బాలుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కలారీ యోధులకు సన్మానం



అవార్డులతో కలారీ ఔత్సాహికులు

కొడంగల్‌: భారతదేశ ప్రాచీన కలారీ విద్యకు ప్రభుత్వం ప్రాచుర్యం కల్పించాలని పలువురు వక్తలు కోరారు. పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం కలారీ ప్రదర్శకులకు సన్మానం చేశారు. కొడంగల్‌కు చెందిన రమేశ్‌ శ్రీరామ జన్మభూమి అయోధ్యలో కలారీ ప్రదర్శన చేశారు. ఆయనతో పాటు పలువురు విద్యార్థులు అందులో పాల్గొన్నారు. వారిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్ర యాదవ్‌, ఎస్‌ఐ భరత్‌రెడ్డి, హిందూవాహిని ప్రముఖ్‌ రాకేశ్‌, న్యాయవాది రవీందర్‌, భాను సత్కరించారు. అయోధ్యలో కళాప్రదర్శన నిర్వహించినందుకు అక్కడ ఇచ్చిన అవార్డులను తిరిగి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువకులు చిన్న పొరపాట్లు చేసి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యువతకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో కలారీ లాంటి ప్రాచీన విద్య తెలియని వారు ఎంతో మంది ఉన్నారని అన్నారు. ఇలాంటి సమయంలో మన రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ విద్యను నేర్చుకొని మన ప్రాంతానికి గొప్ప పేరు తెచ్చిన రమేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సర్వేష్‌, మాఫీ వెంకటయ్య, నవీన్‌, సూరిగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన ఏసు నామస్మరణ



అంతారంలోని మెథడిస్ట్‌ చర్చి వద్ద మట్టలతో చిన్నారులు

తాండూరు రూరల్‌: మండలంలోని అంతారం మెథడిస్ట్‌ చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవుల తొలి పండగైన ఈస్టర్‌కు వారం రోజుల ముందు మట్టలతో ఊరేగిస్తారు. ఈ మేరకు పిల్లలు, పెద్దలు మట్టలను అలంకరించారు. అనంతరం క్రీస్తు బోధనలతో గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో సంఘం కాపరి పి.భాస్కర్‌, క్రైస్తవులు ఉన్నారు. ఎన్టీఆర్‌ కాలనీలో క్రీస్తు బోధనలతో ప్రార్థన మందిరం అధ్యక్షుడు విక్టర్‌ మూవీస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్‌: అప్పులబాధతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫరూఖ్‌నగర్‌ మండలంలోని వెలిజర్ల గ్రామశివారులో ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఏఎస్‌ఐ రాంచందర్‌ కథనం ప్రకారం.. మండల పరిధిలోని వెజర్ల గ్రామానికి చెందిన రామకృష్ణ(35), అరుణ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. రామకృష్ణ ఈ నెల 21న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీకోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం లేదు. గ్రామ సమీపంలో కొందరు యువకులు క్రికెట్‌ ఆడుతుండగా ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందినట్లుగా గుర్తించి గ్రామస్తులు తెలియచేశారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ రాంచందర్‌ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి రామకృష్ణగా గుర్తించారు. అప్పుల బాధతో రామకృష్ణ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంచందర్‌ పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌ కుమార్‌కు సన్మానం

ఆమనగల్లు: బీఆర్‌ఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నాగర్‌కర్నూల్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఆర్‌ఎస్‌.ప్రవీణ్‌కుమార్‌ను ఆమనగల్లుకు చెందిన పలువురు నాయకులు సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యటించి తిరుగుప్రయాణంలో ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌ కుమార్‌, మిషన్‌ భగీరథ రాష్ట్ర మాజీ వైస్‌ చైర్మన్‌ ఉప్పల వెంకటేశ్‌, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్‌లు ఆమనగల్లు పట్టణంలోని టీ హౌస్‌ వద్ద కొద్దిసేపు ఆగారు. విషయం తెలుసుకున్న పలువురు బీఆర్‌ఎస్‌ నాయకులు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. ప్రవీణ్‌ కుమార్‌ ఎంపీగా విజయం సాధిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆంజనేయులు యాదవ్‌, భాస్కర్‌, అల్లాజీ ఉన్నారు.

నిఘా లోపం.. గొడవలే నిత్యం!

- శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల నిర్లక్ష్యం
- తాండూరు పట్టణ రోడ్లపైనే తగాదాలు



తాండూరులోని రైల్వేస్టేషన్‌ ఎదుట ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు (ఫైల్‌)

తాండూరు: శాంతిభద్రతలను అదుపులో ఉంచాల్సిన పోలీసు అధికారుల పనితీరు తాండూరు పట్టణంలో గాడి తప్పుతోంది. రెండు నెలల క్రితం వరకు ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్న పట్టణంలో గొడవలు, రోడ్లపైనే దాడులు పరిపాటిగా మారాయి. శాంతి భద్రతలను పర్యవేక్షించాల్సిన అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారంటూ విమర్శలు వెలువెత్తుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో జరిగిన సంఘటనలే అందుకు నిదర్శనం.

తరచూ ఘర్షణలు

జిల్లాలోనే వ్యాపార వాణిజ్య కేంద్రంగా ఉన్న తాండూరు పట్టణంలో శాంతిభద్రతలను పర్యవేక్షించడంలో పోలీసు శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రెండు నెలలుగా పట్టణ శివారులో ఉన్న కాగ్నానది నుంచి అడ్డగోలుగా ఇసుక రవాణా చేస్తూ అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రిపగలు యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. ఇసుక రవాణా చేసే వారి మధ్య గొడవ జరగడంతో నదిలోనే హంగామా సృష్టించారు. దీనిపై పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి. మరోవైపు పట్టణంలోని రైల్వేస్టేషన్‌ వద్ద పక్షం రోజుల క్రితం హోటల్‌ విషయంలో జరిగిన చిన్నపాటి వివాదంతో వందలాది మంది చేరుకొని రోడ్డుపైనే ఘర్షణకు దిగారు. అయితే రక్షకభటులు మాత్రం ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ నెల మొదటి వారంలో సీసీఐ కాలనీలో అద్దెకు రూమ్‌ తీసుకొని ఉంటున్న ఇద్దరు హిజ్రాలపై స్థానికులు రోడ్డుపై అమానుషంగా దాడిచేశారు. ఈ విషయం సోషల్‌ మీడియాలో వైరల్‌ అయింది. రెండు రోజుల క్రితం వడ్డీ డబ్బులు ఇవ్వలేదనే కారణంతో ఓ వ్యక్తి ఆటోడ్రైవర్‌పై పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు.

రోజూ ప్రమాదాలు

తాండూరు పట్టణంలో ట్రాఫిక్‌ సమస్యలను పరిష్కరించాల్సిన పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లను కబ్జా చేసుకొని యథేచ్ఛగా వ్యాపారాలు చేస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై ఉన్న తోపుడు బండ్లను తప్పించబోయి వాహనదారులు అదుపుతప్పి రోజూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

భద్రతను కట్టుదిట్టం చేస్తాం



పట్టణంలో శాంతిభద్రతలపై పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసుల పహారా చేస్తున్నాం. రోడ్లపైకి ఘర్షణలకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ,తాండూరు

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

సీఐకి వినతిపత్రం అందజేసిన వామపక్ష నేతలు



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

తాండూరు టౌన్‌: అధిక వడ్డీలు వసూలు చేస్తూ సామాన్యులను నిండా ముంచుతున్న చిట్‌ఫండ్స్‌, వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీల నాయకులు పట్టణ సీఐ సంతోష్‌ కుమార్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. గత నెల 25న తాండూరు పట్టణం రాజీవ్‌కాలనీలోని ఆటోడ్రైవర్‌ బాలప్పను వడ్డీ చెల్లించడం లేదంటూ ఓ వ్యాపారి దారుణంగా చితక బాదిన సంగతి సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్‌ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు వడ్డీ వ్యాపారుల దాష్టీకానికి బలైపోతున్న సామాన్యుల తరపున సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్‌, సీపీఎం జిల్లా నాయకుడు కె.శ్రీనివాస్‌, సీపీఐ(ఎంఎల్‌) న్యూ డెమోక్రసీ డివిజన్‌ కార్యదర్శి పి.శ్రీనివాస్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ లైసెన్స్‌ లేని చిట్‌ఫండ్స్‌, ఫైనాన్స్‌, వడ్డీ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలపై వారు పాల్పడుతున్న దాష్టీకాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. అధిక వడ్డీల పేరుతో సామాన్యులను పీడిస్తున్న వారిపై పీడీ యాక్ట్‌ నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మునీర్‌, రఘు, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.